# కాలం చెప్పిన తీర్పు

చూస్తున్న తన కండ్లను నమ్మలేని బీమమ్మ ఈఁత్యాప రొండు సేతుల కండ్లను నల్సు కోని గట్టిగ పాటిచ్చి చూసింది.

అవును ! తన కడ్పులల్ల నిలవడ్డది పెద్దొర్సాని పాపవ్వనె !

తనవాకిట్ల, తనగలుమలల్లదొర్సాని ! ఇదేం చిత్రం ? దొర్సాని తనగుడిసెకు వచ్చు డంటె సిన్న సన్న ముచ్చటా ?

దొర్సాన్ని జూడంగనె బీమవ్వకు ఏడుకొండల ఎంకటేశున్ని జూసి నంత సంబురమైంది; అటెంకబుగులైంది.

పాపవ్వదొర్సాని సన్నగ నగినట్లనిపిస్తుండది; అనిపిచ్చుడుగాదు నిజంగనె నగుతుండది.

బీమి ఎదల ఎన్నెల పిండారపోసుకోంగ , ఏనిగంతబలం వొచ్చింది. మెల్లగ నోటంట మాటపెకిలింది; ఆత్రం సోటుజేసుకున్నది.

'దొర్సాని ! తమరు ? గీ పూట, పురుగూ బూసి, ఉచ్చా, ఊబ్లి, పెంటికలు రొంపి రొష్టు దొక్కుకుంట నాగుడ్సెకు.....? ఎంకటినికూతేయ మనకపోయిన్రా 'వో ' అంటొచ్చి నీ పాదాలకాడ వాలక పోదునా? బాంచెను, అంటుండది బీమమ్మ.

దొర్సాని చెవులు బీమి మాటలు ఇంటుండవి గని, కండ్లుమట్కు బీమిగుడ్సెకు వారిచ్చిన పొట్ల తీగె ఏపుగ ఎదిగి వామనమూర్తి చెత్రోలె గుడ్సెంత అల్లుకొని పూతవెట్టి, పిందెలేసి కద్రువమ్మ సంతాన మోలె ఇర్గగాసిన కాయల సోకును, వైనాన్ని జూస్తుండవి. ఇంగ, ఆ నెత్తి ఎన్నెన్ని కొంపలుగూల్సె ఆలోచన్లు జేస్తుండదొ?

నిజంగనె ! పెద్దోండ్ల పుట్టుకే ఏరు, వాళ్ల తరిఫీదు అంతకన్న ఏరు, కాకుంటె? మన మంది తీర్గనా ఏంది? ఒక్కటే సూపు ఎడ్డీర్కపుసూపు, రొండెర్గని ఎచ్చిడితనం

వాళ్లకెక్కడిది ?

ఒక్కసోట వున్నగని పెద్దోండ్ల మనుసు, సుట్టురా నాల్గామెడసుట్టిసూస్తది, కన్నూ ముక్కు సెవులన్ని అన్నికాలాలల్ల మేల్కోని వాటి పని అవి జేస్కుంట పోతనేవుంటవి, చేయాల్సిన పనికి రూపు రేకలు అప్పుడె ప్రాణం బోసుకుంటవి. బుద్ధికి అంత పదును, సురుకు లేంది వుత్తపున్యానికి దొరలు, దొర్సాన్లు అయితర ఏంది ? అందుట్ల మన పాపవ్వ పెద్దొర్సానాయె.

సచ్చిసొర్గాన వున్న పెద్దొర గోపాల్రావు పెండ్లం, కర్కోటకమారాజు ఎంకట్రావ్ సెల్లె; అంగిట తీపి ఆత్మన ఇసం నింపుకున్న పుణ్యాత్కురాలు పాపవ్వ. ఈతల్లికి దగ్గట్లె గుండెలుదీసె గుండగాడు కొడుకు శ్రీనివాసరాయుడు. ఇంగా సదువు ఎల్లవెట్టనె వుండడంట.

ఇంత కఠినం ! నల్లరాతు అసొంటి గుండెవున్నా ఆపాపవ్వ తల్లి 'దర్మదోని ' అంటనె చిల్లెర జనం నమ్ముతరు. నరంలేని నాల్కె ఎటంటె అటె దిర్గుతది, ఆర్సమైన రాజకీయ నాయకయ్యలు గుడ పాపవ్వ చుత్కారం ముంగల బోర్లవడాల్సిందె. ఈతల్లి న్యాయం జెప్పితె తిర్గులేదంట నాల్గూళ్లకు పేరువోయింది. నాతల్లిని కిందవెట్టె బూమి బండదు, మీదవెట్టె వానగుర్వదు.

అసోంటి పాపవ్వ దొర్సాని ఒక్కసూపుతోనే; బీమి గుడిసెను, దాని సుట్టు పక్కల సింగారాలొలుకుతున్న మామిడి, జామ, నిమ్మ అంట్లను, దాని సుతారాన్ని అంత పార జూసింది, మనుసుల కసిబిసి వడ్డది. అమ్మో ! ఏమో అనుకున్న, ఏకు వోయి మేకు అయ్యె టట్లుండది యెవ్వారం. గుడిసెసుట్టు సిప్పెడు జాగనువూకెవోనియ్య లేదు, బగీచ వెంచుతుండది బగీస అంట అనుకోని పొట్లకాయల మీదకెళ్లి సూపులు మళిచ్చ కుండనె, ''బీమీ ! నీగుడ్సె అల్కుపూతలతోటి పచ్చగ పెండ్లి పిల్లోల్లెగండ్ల వడ్తుండదె, చూస్తుంటె వోపూట వుండ బుద్ధి ఐతండదె ' అంట దువ్వింది.

దొర్సాని మాటలు ఇంటున్న బీమికి ఎదనిండిన సంబురంపొంగి ఎచ్చిడ్డె కండ్ల పొంటి వొలుకంగ ఆముత్తాలను సాలీసాలని కొంగుతోటివొత్తుకుంట ''దొర్సాని ! ఈ గుడిసె ఎవరిదనుకున్నరు? తమరిదేనాయె; నానెత్తిన నీడవోయినంక దిక్కులేని నాకొంగుల ఈజాగను బిచ్చమేసి నిలవెట్టింది మనదొరవారే గదనయ్య ! మీ దర్మగుణం జేయవట్టే ఈనాడు నాగుడ్సెన గుడ్డిదీపమన్న ఎలుగు తుండది.

తమరింతగానం ఇంగా మెచ్చుకుంటె, నాముడ్డిన జుట్టిన ఈ మూడు మూళ్ల పేగు గుడనిల్వదయ్యి! పనేందొ? సెప్పుదురుగని పదుండిపోదం దబ్బున బంగులల్లకు అంట గుడ్సెకు తడ్కతల్పు అడ్డం బెట్టి దొర్సాన్ని దోల్కోని తోవవట్టింది బీమి.

ఉబ్బాగని బీమి తోవల్నె ''అయ్యా! ఇంతకు తమరికాలికి మన్నంటిచ్చిన పనేందొ సెప్పరైతిరి ? అంత తుర్తులపని ఏందో ? బాంచను '' అన్నది. దొర్సాని గంబీరంగ నడ్సుకుంట, ఏందొ? యాది కొచ్చినట్ల నిలవడి ''బీమీ ! ఇగో ఈనీళ్లతొట్టిలనీళ్లు ఎల్తివడ్డవి, నిండుగలేకుంటె బయిటిసెంబు ఆరాబురిగ మునుగదు. ఆవలీవలకువోను తిప్పలైతది, సేజేత బాయిల శాదేసి రొండు బొక్కెన్లు వోయి అంట తియ్యటి హుకుం జారిజేసి పెరట్లున్న రేగి సెట్టు గద్దె మీదగూసున్నది దొర్సాని.

పొద్దునజేసిన కష్టం జాలక బీమమ్మ నడ్మలిర్గంగ పెద్దగోలెమంత తొట్టినింపింది.

ఇద్దరు పెరడు దాటి ఇంటెన్కదిడ్డిదరువాజ దెర్సుకోని దొర్సాని వంట ఇంటి ఎన్కసాయమాన్లకు నడిసిన్రు.

వొచ్చిన బీమికి అతీ గతి యాది సెప్పకుండ కలవడ్డట్ల దొర్సాని ''బీమీ ! జర కర్ణప్పంతులు పెండ్లాం అండమ్మను రమ్మన్న నంట చెవులేసిపో'' అన్నది.

''అయ్యో! గదెంతపని అట్లెజెప్తలే' అంట బాట వట్టింది బీమమ్మ.

బీమమ్మ ఉప్పరి ఎలమందపెండ్లాం. ఎలమంద తండ్రి పేరువోయిన సుతారి కాడు, యాపని జేసినా ఫొక్త పజ్జేస్తడు, గని ఆయిన ద్రిష్టిల సుతారిపని అంటె తక్కువ, రొండెడ్ల గట్టుక బూమిదున్ని ఎగుసంజేసుడే ఖదరు, అందుకని పెండ్లాంమీది తులం మాసం అమ్మి రొండెకురాల బూమిని పాపవ్వ అన్న ఎంకట్రావ్ తాన ఖరీదు చేసిండు.

రెక్కబొక్కలిర్సుకోని తాను, కొడ్కు ఎలమంద ఆ బూమిని రాయిరప్ప ఏరిదు న్ని దులుపరిచ్చి జీవాలదోలి పాటివెట్టి అలుకంగ పంట పండి పడ్సు పిల్లోలె ఎదిగి వొయ్యారాలు వోయింది.

అదిజూసి కండ్లుమండిన యిసప్పురుగు ఇది హరిజనుల మాన్యం కింది ది. దీన్ని ఎవ్వరు కొనగూడదు, జప్తుజేస్తం అంట పట్వారి చంద్రయ్యను అడ్డం బెట్టుకోని నోటీసు జారిజేపిచ్చిండు.

అందరొక్కటై ఎలమంద తండ్రి గోవిందు నెత్తిన సేతులు వెట్టి వుత్త బత్తల జేసిన్రు. ఈపికరు తోటి గోవిందు మంచంబట్టి ఆఖరికి గుటుక్కుమన్నడు. ఆర్నెల్లి లోపట తల్లి గూడదాటుకున్నది. ఇంతటి ఎతను బరిచ్చులేని ఎలమంద ఎన్కాముందు జూడకుండ వున్న వూరిడ్సి సిన్న బొడ్డపల్లె దొర గోపాల్రావు కాడపాలేరైండు.

ఎలమంద గోపాల్రాయనికి పాలేరు తనానికి కుదిర్నాటికి మాంచికోడె పాయాన వున్నోడు. నిజాయితికి నిప్పుతునుక్కలె, పనికివొంగోలు ఎద్దోలె, నమ్మకానికి పెట్టింది పేరోలెమెసిలిండు.

బీమవ్వ గుడ ఎలమందకు దగ్గపెండ్లామె ! కాయకష్టమంటె బెదిరిరెక్కలు దాసుకునె మనిషిగాదు.

యా మాటకామాట జెప్పాల్నంటె గోపాల్రావ్ ఎదమెత్తన గల్లోడే ! బామ్మర్ది ఎంత జెప్పినాఇనకుండ ఎలమంద కొడుక్కుకోదండాన్ని పసుల గాయనెట్టమని ఎలమందను, బీమిని బలవంతం జేయకుండ తనకొడుకెంట సదువుకోమని బడికి దోలిండు.

పెద్దొర గోపాల్రాయని లోపట ఎలమందకు దేవుడు గానొచ్చిండు.

పదేండ్లనాడు దొరివారి నాల్గు మోట్ల కొత్త బాయికి 'పుణ్యావాచినం' జరుపాల్నని తయారైన్రు. మోట బార్ల కింది మత్తడి ఇంగా సరిగ దిమ్మి సవడలేదు, అయినా మూర్తం దాటిపోకుండ ప్రవోజినం జరుపాలనుకున్నరు.

సుక్కవొడువంగలేసిన ఎలమంద మోట బార్లు సరిగ కుదురు కున్నవో లేవో అంట వోయి సిమ్ముల కాడనిలవడి తొక్కుతున్నడు, ఇంతట్లకె ఆడున్న నూనె కట్ల పాము కాటేసింది, ఆబ్బో అంట సిమ్ముల మీదకి వొర్గిండు,

అర్సమైన మనిషి వూపుకు; బలానికి ఆగలేని మత్తడి వొణికింది, ఎలమంద ఎంట మత్తడి గూలిబాయిపాలైంది.

ఒకొంకమీది బర్వు ఎలమందను లేవనియ్యలేదు, రొండో వొంక కట్ల నాగు ఇసం పై అంత వారంగ నురుగులు గక్కి సచ్చిండు. ఎలమంద.

బీమి వెంుగణిసొవు ఇని ఆవు అర్సినట్లర్సింది. దిక్కులేందైంది,

కొడ్కు కోదండం ఆరేండ్ల పోరడు. .

అప్పుడు పెద్దమణుసులొొచ్చి ''బీమి, పాపవ్వ ఇంట్ల పనిపాటలు జేస్కుంట ఇంట్ల కూటికి పడివుంటది. దాని కొడ్కు పసుల గాస్తడు ఏంది ? ఇంతకన్న బత్కుదెర్వు ఎట్లుంటది '' అన్నరు.

అందుట్ల నర్సయ్య పంతులు జూన్రాయిన అందుకోని :-

''దొరవారు ! నా మాట ఒక్కటివినిపిచ్చుకోండి ! తమరు ధర్మాత్ములు, పోరడు ఇంగిలీకమొలె చురుకైనోడు; బుద్ధిపాదరసం తీర్గ తట తటలాడ్తది. వాణి తండ్రి మీసేవల్నె ప్రాణాలిచ్చిండు, కనికరిచ్చి వాణ్ణి సదువుకోనివ్వుండి '' అన్నడు.

పెద్దమణుసులు గుర్రుమన్నరు, ఎంకట్రావ్ ఎటుకారంగ నగుకుంట 'నర్సయ్య పంతులు ! రొండక్షిరాలు రాంగనె బ్రావ్మన్ల తీర్గ దర్మసూత్రాలు వల్లిస్తనంటె కుదుర్తాది ? నీవు వుకె గూసో '' అంట ఉర్మి కర్ణప్పంతుల్ను జూసి -

''పంతులు ! ఏంజేయాల్నో సెప్పుండి ' అన్నడు.

పంతులు అతివినియంగ సేతులు జోడిచ్చి 'దొరలకు దెలువందే ముండది ? తమరి బావమర్ది గారి మాట, మతులబు సరిగనే వుండది' అన్నడు.

అంత ఇన్నపెద్దొర -'ఎలమంద కష్టానికి నేను రుణపడ్డ: వాణి పెండ్లాం, పిల్లల సంరక్షణ భారం నాది. అందికే బీమికి రొండు బిగాల బూమి ఇస్తుండ, అదిసేండ్లల్లకల్పు కోతలు జేస్కోని బత్కుతది, దానిపిలగాణ్ణి సదివిచ్చుకుంటది ' అంట తీర్పు ఇచ్చిండు.

నర్సయ్యపంతులు పొంగిన ఎదతోటి' అందరికి దండాలు అనుకుంట ఆవలికి నడ్సిండు. పెద్దమణుసుల మొకాలు పెంకలోలె నల్లవడ్డవి.

ఈతీర్పు యిన్న బీమి బోరుమనుకుంటొచ్చి దొర్సాని కాళ్లువట్టుకోని 'తల్లీ ! నన్ను మీనుండి ఎడవాపకుండి; ఈకాణ్నుండి నాకు తల్లీ తండ్రీ అంత తమరె ! అన్నది.

కొడుకును ఎప్పటి తీర్గసదువుల వెట్టింది. తనేమొ దొర్సాని దగ్గర జేరింది.

ఎలమందవోయి యాడాది తిర్గకుండనె దొర ఎకాఎకిన గుండెపోటొచ్చి కాలంజే సిండు. పాపవ్వ దొర్సాని రాజేర్కం జేయవట్టింది. పెద్దొర బీమికి గుడ్సెకని ఇచ్చిన నాల్గు గుంటల బూమిని ఇచ్చిన కాడ గాదని' దొర్సానికి తోడుగ ఆసరవుండాలె ఎప్పుడు వో

మనిషి' అంట, పెద్దోర్సాని కంచెంత ఇంటెన్క పెరటి గోడను అనుకోని పెంటకుప్పలు, బొందలు, బొరిగెలు, పల్లేర్లు, పాంపడిగెలు, జిల్లేళ్లు, జిత్రేగులు, మెండుకున్న బూమిని జూపి 'ఇది నీది' అంట ఆగోడబాజు పోంటి వోగుడ్సె ఏసి ఇచ్చిన్రు.

ఎందుకు పనికిరాని పోరం బోకు కన్న , సవిటి పఱ్రకన్న, ఉస్కవెట్టిన న్యాలకన్న ఆన్యాలమైన ఆ చెక్కను బీమి, బీమికొడుక్క గల్సి, ఎండకాలం సెలువుల్ల, దసర పండుగకు, కిసిమిసు సెలువులంట ఇచ్చినప్పుడు పికాసువట్టిగెల్లగిచ్చి, గడ్డపారతోటి తోగి, పారతోటి సదును జేసి, పనికిరాని సెట్లన్ని పీకి పోగు వెట్టి కాల్సి ఆబూడ్దిని ఆకు అలం పెండగల్సి ఎరువుకుప్పలు గట్టి, ఆకుప్పలకు నీళ్లు వారిచ్చి, అవి ఎరువైనంక బూమిలేసి నీళ్లతడివెట్టి మొక్కజొన్నవండిచ్చుకున్నరు, ఇంగిప్పుడిప్పుడె పండ్ల సెట్లు నాటుకున్నరు.

ఈపెరుగుదల దొర్సానికి కడుపుబ్బరం గూర్సింది.

బీమి ఇట్ల వోయి వాలిందో లేదో కర్ణపు అండమ్మ ఏకాఎకిన కట్టిన మడిచారు సక్కన జేస్కోని -

''అమ్మో! ఊరిమీద ఆడిపోస్కోను కావల్సినంత జోలి! దీనికన్ను పాడుగాను ఎవరింటికి సూటివెట్టిందో ?

ఎట్టిగుడ, తామేదొరలం అంట వూరోళ్ల బూములన్ని కబ్జలవుండవంట కింది మీదు గానకుండ నడుస్తుండది. అందరిజుట్లు ఈదొరలు, దొప్పల సేతులుంటె, వీండ్ల జుట్లు మా పంతులు సేతులుండె.

ఇంతకు యాకొంపకు అగ్గివెట్టాల్నో ? రొండు ఎండుపుల్లలేసి ఇసిరి రాజవెడ్దం, అంట దొర్సాని భవంతిలకు నడ్సింది.

వస్తున్న అండమ్మను జూసి కడ్పుల లేని ఆరివారం వల్కబోసుకుంట 'రావమ్మ అండమ్మొదినె, అయ్యో! మడిబట్టగట్టినట్లుండరు.

'వొదినె! మీరు పిలిపిచ్చుడు, నేనురాకపోవుడా ? నాకన్నతొలిగ బీమిని జూసిన మీయన్న దొరవారింటినించిపిలుపొచ్చింది మడీమైలఅనకు పో' అంట ఆత్రపెట్టిన్రు.

'వొదినె! అన్నయ్య ప్రాణవార్తికం నాకుదెల్వద? గని, ఈనడుంగల బీమిపెరడు

వార జూసినవా'?

'ఇస్సీ! నాకేంపని? దానిపెరడు వాగులవోను, సెర్లవోను, అదిపెరడా! బొందల గడ్డ, ఆపనికివూలినపత్ర- దానికీర్తి మీకు అంటగట్టెటందకు మీఅన్నయ్య ఎంత తతంగం నడిపిన్రకున్నరు?

అండమ్మొదినె! మీరుపురాగ, నేనువడ్డట్లె అమాయికంలవడ్డరుసుమా! ఆ బీమి, ఆబూమిల బంగారం బండిస్తుండది. చిల్లెరజనానికి సత్తువ ఎక్కువ, తమపని అనంగనె బొక్కలు సున్నంజేస్కోని పనిజేస్తరు, మనదంటె మూలలీగుకుంట సస్తి నబ్బో అంట నడుస్తరు.

'అయితె? దొర్సాని! తమరి ఆలోచనేందో?

మరీ ఈజనవంత ధాన్యపురాసులు రాల్చుకుంటుంటె? ఆకలి అంట మన భవంతులు దొక్కుతారు; అందికె ఎప్పటి రెక్కలు అప్పుడె గత్తరిచ్చాలె' ఉపాయం జెప్పు. అన్నదిదొర్సాని.

వైద్యుని సంచిల అన్నిరోగాలకు పనికొచ్చె 'వైష్ణం, భైరవి' వున్నట్ల అండమ్మదగ్గెర హాజిరీజవాబు లుంటవి.

'అయ్యోదొర్సాని! అదెంతపని? రేపు తెల్లారంగనెవో మాంచియిత్తనపు పుంజను, గుడ్లకొచ్చిన నాల్గుపెట్టలను గంపలకెత్తిపంపు ఆపెట్టలు గుడ్లువెట్టి కూముకు కూము తయా రైతవి. ముందే కోడిజాతియాడున్న ఇత్తునం పొడ్సుకతింటయి. బీరమ్మ దెచ్చుకున్న పరం మిగులనియ్య కుండతింటయి.

ఇంతటితోనివోనియ్యకు, వోరెండుపందులను, రొండుమ్యాకలను, రొండు కుందేళ్లను పోతెపాయంట బ్యారంజేసికొని, బీరవ్వ పెరట్లకుదోలు, సుట్టుపక్కల మంది సెవులు గొరుక్కోకుండ చెరిసగం పాలంటజెప్పు, ఇత్తనపుజీవాలకు ఎన్కసీరి లెక్క గడ్డువుగని, అప్పుడు జూస్కో బీరి బీరాలు బిగిదప్పి, పచ్చటి పెరడు పెంటకుప్ప గాకుంటె నన్నడ్గు. అదేసేయలేక, గింజుకోలేక గుడ్లెల్లిసస్తది.

నీపేరుపెద్దిర్కానికి యాదోఖవుండదు, - అంట సలజెప్పింది.

అండమ్మ జెప్పిన తిరుమంత్రం బాగనె వారుతుండది. తేలుకు ఇసం కొండిన,

కుందేళ్లు రికాంలేకుండ అకు అలం నముల్క మింగుతనే వుండవి

ఆ గుడ్సె దొంగలు దోసిన ఇట్లోలె అయింది.

బీమమ్మను బవంతిలకు పిలిపిచ్చిన్రు ఎంకట్రావు, పాపవ్వ దొర్సాని గల్సి. నెత్తింత బట్టింత్తై బీమి దివాల దీసినట్ల వొచ్చి నిలవడ్డది.

అట్లొచ్చిన బీమమ్మను జూసి ఎంకట్రావ్

'అదేందె ? బీమి ? పురాగ గైకాలు వడ్తున్నమణిసోలె అయినవ్ ? జెర చాయె పలారం జేయి ' అన్నడు.

'పాపవ్వ దొర్సాని వుండంగ నాపొట్టగంజికి కొదువాండదిదొర ? పనేందొ? సెప్పురి,ఆవల పందులు జెరకన్నుమరుగైతె సాలు, తఙ్కగూల్సి గుడ్సెలోపటి కొచ్చి వున్న రొండు కుండ బోకుల్తోటికుంటి బిచ్చాడు కుంటయి .' అన్నది.

రేపురొండు పైసలు కండ్ల జూడాల్నంటె తిప్పలవడాలె ! అవ్వగావాలె బువ్వగా వల్నంటె కుదుర్తాదె? ' అన్నడు దొర్సాని అన్న

ఇంతట్లకె పాపవ్వ దొర్సాని అందుకోని -

'సూడు బీమి ! తుర్తుల వోపనొచ్చింది, మన కంచెకాడిసింతలు రాల్పిపండు గొట్టిచ్చి, అమ్ముకానికి గొంచవోవాలె, గట్టునకావలి గాయకుంటె రాల్పిన కాయంత కోతులపాలు ,దొంగలపాలైతి, తమ్ముడు దొర ఒక్కరు సరిపోరు, సిన్నదొరనువిలుత్త మంటె పరీక్షలాయె అందుకని ఇంటిపోరడు మన కోదండం వుంటె బాగుంటది, జెర పిలిపిచ్చితోలు, కష్టం వుంచుకోను ' అన్నది.

ఈమాటిన్న బీమమ్మకు మీదిప్రాణం మీదినె వోతున్నట్ల నిపిచ్చింది, ఆఖరికి దైర్నం జేసి,

''దొర్సాని ! మనసిన్నదొర, నాకొడ్కు ఒక్క కిలాసే అంట గద, మరి పోరడు పరీచ్చ రాయకుంటె తప్పిపోడా ? వొద్దు దొర్సాని సదువు బందువెట్టను '' అన్నది.

ఆమాటిన్న దొర్సాని, గుడ్లెర్రగ జేసి 'ఏందె ? బీమి ? నీకు పొగరు బాగ నెత్తి కెక్కింది, లేకుంటె సిన్నదొరకు గవ్వకు కొరగాని నీకొడ్కుతోటి పొల్కెవెడ్తావ్ ? సిన్న

దొర రేపు మినిస్టరే ఆయితడా ? తాలుక్ దారే అయితడా ? పోలేసు అప్సరే అయితడా ? మరి నీకొడ్కు సదివి సర్పంచైతడా? రాజ్యాలేల్తడ? ఏందా ? తిర్రిగుణం బోనియ్యక పోతివి. పోరడు ఎట్లారాడో సూస్త.

నేనేం ఎట్టిజేయమన్ననా ? సేయగూడని పనిజెప్పిన్నా ? వోరొండుదినాలు, నిగా వెట్టవన్న. గాయింతదానికి సదువుల ఇన్సిపేటరోలె వొకాలతు మాట్లాడవడ్తివి ? అంట వుర్మి వుర్మి మాట్లాడింది.

ఇంతట్లనె ఎంకట్రావ్ అందుకోని, 'అక్కయ్య ! మీరు వూర్కోండి చిల్లెరగాళ్ల తోటి పెక్కుమాటలొద్దు. ఒకటే మాట -

'బీమి ! అక్కర వడ్డప్పుడు తోడుగాని వస్తువను ఎంటనె ఇడ్సి పెట్టాల్నంట శత్కంల జెప్పిన్రు. మాకిప్పుడు జరూరు పనొచ్చింది. పోరణ్ణి బడి బందు వెట్టిచ్చి పిలుస్తవో ? ఈగుడ్సె ఇడ్సిపోతవా ? సెప్పు ! అన్నడు.

బీమమ్మ మొకంల ఏఇకారం గాన్రా లేదు. 'అట్లెదొర ! మీరన్నట్లెగానీండి ' అంట బిర బిర గుడ్సెలకు నడ్సింది.

బీమమ్మ, ఏడ్వలేదు, అంగలార్వలేదు, దైర్నంగ తనింట్లున్న సాపసింపు, గొంగడి బొంత, తలెచెంబు, పాతసీర రయికె, కొడ్కుమిడీలు, ఎలమందసేతికర వట్టుకోని, బవంతికి మొకం జేసి నిలవడి, మూడుదోసిల్ల మన్నెత్తిపోసి, ఏందో బిసదిప్పిన మిషను నడ్సినట్ల నడ్సుకుంట జార్న నర్సయ్య పంతులింటికి వోయింది.

సూస్త సూస్త కాలం ఆరు అంగీలు మార్సింది.

పెద్దొర్సాని కొడ్కు శ్రీనివాసరాయనికి మీసం కట్టుతోపాటె రావర్సిన అవులక్షి నాలు, అంటె ఇస్పేటాట, అందుట్ల తీన్ పత్తాలాట, బీరు బరండీలు, ఇవేగాకుండ సెప్ప గూడని సిల్లరలక్షిణాలన్ని అబ్బినయ్.

ఈమొగమారాజును జూసి రేపుకాబోయె నాయుక మారాజు గీ లపూటు గాడెయ్యెటట్లెవుండడంట గుసగుసలు వోనట్టిన్రు. జనాలు.

ఆయాల్ల 15వ ఆగస్టు కలెక్టరు గారికి జరూరు పని మీద అంటె 'ఆడోండ్ల ఇస్కూలుకు ప్రారంభం జేసి రిబ్బను గత్తరిచ్చి, అటెంక గవర్నరయ్య

దావతుల షరీకై ముఖ్యమంత్రిని గల్వాల్సి వొచ్చింది.

అందుకని కరీంనగురం జిల్లా జెండావందునాలన్ని కొత్తగ డిప్టీతాలూక్ దారోలె ఎంపికైన కోదండం వంతైంది.

కలెక్టరొస్తుండు, వొస్తుండని సిన్న బొడ్గెపల్లెవూరు మీదవూరు వడ్తుండది. సడక్లన్ని వూడ్సిచ్చిన్రు, వోపదివంంది గల బిల్లజవాన్లొచ్చి ఏర్పాట్లు జూస్తుండరు,. కర్ణప్పంతులు కొత్తదోతి గట్టి గాంది టోపివెట్టుకున్నడు. సర్పంచు పుల్లన్న అచ్చం అంబేద్కరయ్యోలె నిలవడ్తె ఎంకట్రావ్ నిలువు నామం దీర్సి వైష్ణవగురువు తీర్గ కండ్ల వడ్తుండడు. ఇంగ సిన్నదొర శ్రీనివాసరావు కాళ్లకు సన్నటి చెప్పులు, తెల్లటి లాగు, వాస్కోటు దొడ్డి జేబుకు ఎర్ర గులాప్పువ్వు వెట్టి, కండ్లకు నల్లద్దాలు తగిలిచ్చుకోని తానే నెహ్రూ చిచ్చ అన్నట్ల వుర్కుల వెడ్తుండడు.

అందుట్ల జ్యోతిబసులు, ఆర్కేలు, నర్సిమ్మరావులం అంట అనుకునెటోండ్లు గుడ లేకపోలేదు.

ఇంగపెద్దొర్సాని పట్టుసీరల, జయలలితమ్మనా ? రబ్రిదేవమ్మనా? అంట సూసెటోండ్లు దబ్బున గుర్తువట్ట లేకపోతుండరు.

జండవందునం, ఇనాంల పంపుకంగిన అయినంక రివాజుపొంటి 'చాయెదావతు' మండలాఫీసుల గాకుండ పెద్దొర్సాని ఇంట్ల ఏర్పాటైంది.

ఈసారి ఇంతెజాంల యాపొల్లు వోకుండ సిన్నదొర, పట్వారిపంతులేజూసిన్రు. ఎన్కాముంగల సిన్నదొర సిట్కేస్తె సిందుదొక్క వుత్తపున్యానికి వూరిమీనవడి మెక్కికండలు వెంచిన బంట్లు, కిస్తీలల్ల పూలు, మంగళార్తితబ్కులు వట్టుకోను సోరసోర ఆడిపిల్లలను బాటపొంటినిలవెట్టిన్రు.

ఊరిపొలిమేరకాణ్నుండి మండలాపీసురచ్చబండ దాంక రంగుకాయితాల తోరుణాలు, జెండాలు యాళ్లాడగట్టిన్రు.

ఎదురు కోళ్లోలె తప్పెట సన్నాయి మ్యాళం బెట్టిన్రు.

ఆపక్కకు ఈ పక్కకు గాందితాత, అంబేద్కరయ్య ఏశాలేస్కోని ఇద్దరు పోరగాండ్లు నిలవడ్డరు. ఎర్గనోళ్లు యిగ్రాలంట దండం గుడ నెడ్తుండరు.

బార్లు దీర్సి నిలవడ్డమందిల బీరమ్మ, ఎంటికలకు నూనె మెరుగు వెట్టిగోళ్లగొట్టి శిగముడ్సి ఉత్కిన సీరగట్టుకోని, ఇస్టేజికింద పక్కపోంటి నర్సయ్య పంతులు బాజున గూసున్నది.

ఇంతట్లకె మోటారు రయిఁ మనుకుంట మండలాఫీసు రచ్చబండికాడ్కి వొచ్చింది.

అందుట్లకెళ్లి దిగింది డిష్టికలెక్టరు కోదండం.

అందరు తేలగండ్లేసిన్రు. గొంతుల ఎలక్కాయె జిక్కినట్లైంది.

బీరమ్మకు సంతోసం మిక్కుటమై ముచ్చెముటలువోసి, కండ్లు బైర్లుగమ్మంగ నర్సయ్య పంతులు ఆసరతోటి నిలదొక్కుకున్నది.

సూసిన కొద్దికి కోదండంల ఎలమంద గానొస్తుండడు.

బీమమ్మకు ఎదలు బిగువెక్కుతుండవి. సిన్ననాటితీపులు తీగెలల్లంగ పై అంత మొగ్గ దొడ్లు తుండది.

అప్పుడు జూసినోళ్లకు బీమమ్మ సాగుసుకత్తె తీర్గనె అనిపిస్తుండది, జండా వందునం, మాటల దంపుళ్లు, సప్పట్లు అన్ని జర్గినవి.

డిష్టికలెక్టరు కోదండం మంచెదిగి సరాసరి తల్లికాడ్కివొచ్చి అమ్మా ! అంట వొంగి కాళ్లకు దండం బెట్టిండు. బీమమ్మ కొడ్కును అల్లుకోని ఎదకైతె ఆనిచ్చుకున్నది గని, అంతపెద్ద అప్సరు తన కొడ్కు అనే నమ్మిక ఇంగాగల్గుత లేదు. ఆయినగని, పురుగాడని కడ్పు పంటను జూసి

'నాయినా ! సొర్గాన వున్న నీనాయిన ఈనాటికి కడుపార సంతోసపడ్తడు బిడ్డా ! అన్నది.

తల్లికి మొక్కిన మెడతోటే పక్కల్నె వున్న నర్సయ్యపంతులు కాళ్లు తాకిండు. నర్సయ్య దీవిచ్చి దబ్బున ల్యావట్టిండు.

పట్వారి, సర్పంచు, దబ్బున ఉర్కొచ్చి మందిని, ఆసేత, ఈసేత దొబ్బు కుంటొచ్చి డిష్టికి సెరోపక్కన జరదూరంగ నిలవడ్డరు.

శ్రీనివాసరావ్‌కు పై అంతవుంతపొగవెట్టినట్ల వుండవట్టిందిగని, తన సమియం గాదంట పండ్లు పట పటలాడిచ్చుకుంట అవుమానాన్ని దిగమింగుతుండడు.

ఇంతట్లకె ఎంకట్రావ్ 'అప్పర్లు భవంతిలకు నడ్వాలె. ఈయాళ్ల సర్వరాయి అంత ఆడ్నె జరిగింది '' అన్నడు.

పట్వారి చెంద్రయ్య బీమిని జూసి 'బీమమ్మగారు ! తమరు భవంతిలకు దయ చేయాలె ' అన్నడు.

కోదండం పక్కసూపుజూసిండు, నర్సయ్య బీమమ్మను ఆగవట్టిండు. కోదండం అందరు ఎంటరాంగ భవంతిలకు నడ్సి, నడ్మిహాల్లకు వోయి పెద్దొరపాటోకు తనకేసిన దండను P.Aతోన ఇప్పిచ్చు కోని ఏసి దండం బెట్టిండు.

అదిజూసి పాపవ్వ గిలగిలలాడింది. కోదండం ఎత్తు ముందు తానువో నల్లి, బల్లి, దోమతీర్గగుడ, కండ్లవడ్తలేదు. ఇంతకన్న కోదండం ఎదురు వడి నాల్గు మాటలు తిట్టినా బాగుండేది అనుకున్నది.

బీమి ఎన్ని నోములు నోసిందో పూర్వజల్మాన ? దానిపోలికరాంగనె ఫోర్వలేని తనం, రోసం ముంచుకొచ్చింది.

ఇంతట్లకె పట్వారి హవాయిజాజ్‌కంటె ఏగంగవుర్కి, కలం దాన్ల దాసిన పెద్దొర రాసిచ్చిన పట్ట కాయితాలు దెచ్చి కోదండం సేతుల వెట్టి -

ఇవి తమరి భూమి కాయితాలు, ఇంతకాలం బద్దురంగ గాపాడిన, సర్కారు వుప్పుదిన్నోణ్ణి మీకు అన్యాలం జేస్తాన్ ? అన్నడు.

ఆ కాయితాలు దీస్కోని పాపవ్వ దొర్సాని దగ్గరకివోయి -

''అమ్మా ! ఇగో ఇవి మీ బూమి పట్టాకాయితాలు, నాకొద్దు; అమ్మా చిన్న నోట పెద్దమాటనుకోకు, మణుసులను మణుసులుగ జూడనేర్చుకోండి, ఎన్కటిజుల్మి ఇంగ చెల్లదు, ఎద మెత్తన మంచిది.

ఆః మీకొడుక్కను హద్దుల వెట్టుండి, దండం. వొస్త ! అంట తిర్గ మొకం బట్టిండు.

ఎవ్వరికి నోటెంట మాట పెళ్లలేదు; అందరు డింగై సీనిమ్మ చిత్రం జూసినట్ల జూస్తుండరు.

భవంతి మెట్లు దిగి మోటారు ఆపిచ్చి తల్లిని నర్సయ్యను ఎక్కిచ్చుకున్నడు.

సూస్తున్న జనం అంత సంబురాన కండ్ల నీళ్లొత్తుకుంట తమకు దెల్వకుండనె కోదండం మోటరు మీద పూలు జల్లిన్రు.

డిస్టికలెక్టరు తల్లి బీరవ్వ గూసున్న మోటారు కరీంనగరు R.M.B. గెస్టు హౌసుకు నడ్సింది.

కాలం తీర్పు చెప్పింది.

# సిందెబిచ్చెంతల్లీ

నిన్న పగట్యాళ్ల వొంటా వార్పులు ముగిచ్చుకోని గచ్చులు గిన కడుక్కోని, మళ్ల పని తీర్వాటంగాదు రొండు ఇస్తార్లన్న గుడ్డ నంట తోర్ణం ఇడ్సితడ్సి ఇసుర్రాయ కింద వెట్టిన ఆకులూ సొప్పపుల్లలు ముందల ఏస్కకూసున్న. ఇంతట్లకె ఎగపోస్కుంట వొచ్చిన మా శశి అంటె కొత్తగ పెండ్లైన నా అన్న బిడ్డ. దాన్ని మా వూరికే యిచ్చిన్రు. అది గుడ మా పాలోండ్లకె వడ్డది. అది వచ్చింది రాంగనే

'అత్తా ! ఈవూళ్లె అన్నీ చిత్రాలెసిగురిస్తుండయి. నేనొచ్చిన కాణ్ణుండి జూస్తుండ గద, దినాం వోకొత్త విచిత్రం యిరబూస్తుంది. అంట మొదలు వెట్టింది.

దాని ముచ్చెట ముందుకు సాగనియ్యకుండ మొగ్గల్ని తెంపేసినట్ల నేను దాని మాట వట్టిచ్చుకోకుండ, కుట్టే ఇస్తారిని యిడ్వకుండ కొత్త కాస్రిరం ఈ పిల్ల యాదన్న జంజాట్కాంలవడ్తె కష్టం అంట మనుషుల అనుకోని 'ఏందో? అంత సిత్రం? యిల్లైనంక అత్తలూ, ఆడపిల్లలు వుండనే వుంటరు, మరి నీవు జెప్పేది అత్తముచ్చెటనా? ఆడపిల్ల అండమ్మ ముచ్చెటనా? అంట అడ్గుతుంటే మా శశి-

లోలక్కుల తళ్కులు చెక్కుమనంగ నెత్తి ఎడ్మనుండి కుడికి దిప్పు కుంట మా ఇంటోండ్ల సంగతి కాదత్తా! మా ఆసామి బాబయ్యలేడా? వాళ్ల ఇంటి సంగతి 'అన్నది. ఆమాటినినేను.

''సూడు తల్లీ శశి! ముందే మీ అత్తమ్మ నిప్పసొంటి ఖరాకండి మనిషి' ముక్కు మీద ఈగెవాల్తె కోసేసుకుంట' అనే బాబతు. జాగ్రత్త! పైనిండ కండ్లు వెట్టుకోని తిరుగు, యిరుగు పొరుగు ముచ్చెట్ల తోటి నీకేం పని? ఆ సొంటి జోళ్లకు నీవు వోకు బిడ్డ! అన్న.

'నామాట జెర యినిపిచ్చుకో అత్త, మా ఆసామి బాబయ్య కోడలు చెంద్రకళ నేను ఇస్కూళ్ల సదివెటప్పుడు తొమ్మిదో కిలాసుల నాకు జతగాడు. పాపం వాళ్ల

నాయిన ప్యాదోడైనా మర్యాదగల్ల మనిషి. నలుగుట్ల మంచోడంట పేరుసంపాదిచ్చు కున్నడు. పాపం ఆచెన్నయ్య తన బిడ్డ చెంద్రకళను, బాబయ్య కొడుక్కు ఇచ్చి పెండ్లి జేసిండు.

'బాబిగాణి మొకం అంగడివోను, వాడూ వో మనిషంట ఆ ఇంటికి ఆపిల్లను తగుల వెట్టిన్రా? ఎట్ల ? వాణి మొకం పాడువడ' అంట తిట్టిన. మళ్లా మాపిల్ల అందుకోని 'బాబయ్య కొడుక్కు ఇంటరు ప్యాసయి, ఏందో గవర్నమెంటు నౌకరి జేస్తుండడు, ఈడూజోడూ బాగుండదంట ఇచ్చిన్రు.

'అన్నీ బాగుండె ఇంగ, కతెట్లవుట్టె? ఎందుకు వుట్టె? అంట అడ్గితే 'ఇను అత్తా! అంట చెంద్రకళ కతంత జెప్పింది.

బాబయ్య వూరు నెమిలిమడుగు, అది మనూరి పక్కనె ఉండది. వాళ్ల యిల్లు మిద్దెగాదు, భవంతి, మాభవంతితీర్గనె వుండదంట. మాగడీల తలుపుల తీరె వాళ్లవి గుడ చెక్కణం జెక్కివుంటవి. యాభై ఎకురాల భూమి, చింతలూ, మామిళ్లు, మోట బావులూ వుండిన్నవి. ఎన్ని వుంటె మట్కు ఏంది? ఆ యింటికీ బూమికి అన్ని తూట్లె, రాబడి కంటె పోకడే ఎక్కువ గాంగ ఏం మిగుల్తది? చెప్పినా నమ్మని సంసారం అది.

రెండు తరాల నుంచి అంత తగ్గు మొకమే వట్టింది. ఆ ఇంట్ల వున్న నాడు బిర్యాని - లేని నాడు ఏకాదశి. దినం రాత్రి అనకుండ నిషాలవుంటడు బాబయ్య. ఎదో అర్ధరాత్రి అపరాత్రికో ఇంటికొచ్చి 'అబ్బ ఆకలి దంచుతుండది అన్నం వొడ్డిచ్చు అంటడు పెండ్లాన్ని. ఆమె పాపం కండ్లు నల్సుకుంట లేసి అన్నం వొడ్డనజేసి తిందువు రా అంటవిలిస్తే ''ఈ గడ్డి నాకెందుకు? మొగడంటె బయభక్తులు లేంకుండ వోయినయి, సియ్యతున్కలేంది ముద్దఎత్తనంట నీకెర్కగద? ఏం మిగమీరిన శాస్తులు అంటడు.

ఆలొల్లికి బయపడి ఆమె కోళ్లగూడు దెర్సి కోణ్ణిగోసి బిర్యాని జేసి పెట్టేది.

ఇట్లె యింట్ల వోనాడు దప్పిచ్చి వోనాడు 'బరండి' దావతు, ఒక్కొక్కడు ఇర్గదాగె టోడేనాయె, అందుట్ల షర్తులు వెట్టుకోని గెలిచ్చిన మాంసం నములుకుంట కోళ్లకు కోళ్లు పీక్కతింటుండిరి. దీనికితోడు మళ్లో ఇంట్ల 'బైటక్'వెట్టి యిస్పేటు ఆట, బాబయ్యకు ఈఆటల షోకు లేదు, గని అంతకు మించిన తాగుడు పిశాచానికి ఎరయిండు.

ఇట్ల ఇంటా బయిట దినాం విందులూ సిందులే అయినంక బండాలం

యాడుంటది ? అదేం వూటసెల్మెగన్క్న ? తీసినకొద్ది, తోడినకొద్ది వూరెటందుకు. ఇట్ల నానాటికి ఆయిల్లు ఈదుగీసినట్ల ఎండిపోవట్టింది. బోజినంల కోడికూరకు బదులు కోడుగుడ్లు సోటుజేసుకున్నవి. అటెంక గుడ్లపులుసు, అదీకరువు గాంగ వుల్లిగడ్డసూక,పప్పులుసు , పెండ్లానికి ఎల్లిపాయె కారం.

పాపం పెండ్లాం వుపాసం వుండి గూడ బాబయ్యకొరకు బొడ్డిగిన్నెల కూర దీసి దాపెట్టి మూడుదినాలు వొడ్డిచ్చేది. ఇదొక్కటి ఆయన జేసిన పుణ్ణెఫలం అంట జెప్పుతరు మంది.

ఇట్ల శాకిరి జేసి వుపాసాలువుండి ఏడ్సి అంగలార్సి లొల్లి వెట్టినా మొగుడు యినక పోతే విసిగి వేసారిన పెండ్లం ఎంకటమ్మ తనమెల్ల చంద్రహారంల నాల్గు బిల్లలు దీసి అమ్మి వోనెల కడ్పు నిండకమ్మగ దిన్నరు. ఈ అవుసరం పూర్తిగ అలువాటుకింద మారిపోంగ, తొల్త నాల్గుబిల్లలు, ఒకసేరు, రొండు, అటెంక పూర్తిగొలుసు, కంటె,వొంకు అన్నిఖతం. ఇంతట్లకె మేల్కొని ఇద్దరికొడుకులను బోర్డింగ్ ఇస్కూల్ల ఏసి సదివిచ్చింది ఆసొమ్ము అమ్మినపైకంతోటి.

ఇంగ బూములన్ని సావుకారికాడ అప్పుకిందికి గిర్వివడ్డవి. పంట మస్తుగనె వండుతది ఆగింజ ఇంటికివొస్తెగద ? కల్లంల కెల్లి సక్కగ సావుకారి గర్సెలకే వోతదొ? తెల్వదు ? గసొంటి పరిస్థితిల చంద్రకళ పెద్దైంది. మొగుడు యింటికి దూరంగ వుద్యోగంల వుంటుండె.

ఇంట్లవో తరీఖలేదు, కట్టువాటులేదు, భయభక్తులంటె ? ఏందొ? మంచ్చికన్న గ్రావు. వొంటవార్పులు యాళ్లకు జరుగవు. పొద్దున్నె లేసి గోళ్లు గిల్లుకుంట బీడువడి కూసోవాలె, అల్కపూతలు, పనిపాటలంటెనె ఏందో సోమరితనం, యంటినిండ మంది మెసుల్తున్నగని యిల్లు 'దో' అన్నట్లె వుంటది.

పెండ్లైన ఆడిపిల్లలు పండుగో పబ్బమో ? అంట వొచ్చినగని వాళ్లకు యాళ్ల పొళ్లంట సూసుడు కరువె ! పాపం మా అత్త చేసేది లేక లోలోపట పిసుక్కసస్తది. మా మామగారు ఘాటైన నిషల పెద్దగుర్రాన్ని ఎక్కినట్లొచ్చి ఎన్కముందు యాది జూడకుండ, బిడ్డలను దగ్గెరికి పిల్సుకోని జెల్సజేస్తడు.కోమటి దుకాండ్ల కెల్లి మిఠాయి లొస్తయి, రెడ్డిహోటల్ కెల్లి కోడికూర, బగారన్నం, బురాంజివొస్తది. ఇట్లరొండు

దినాలు దావతు జేసిసాగదోల్తడు. అటెంక ఈ ఖర్సుల కిందికి వోబిగెడు బూమి వాండ్లకు దత్తంజేస్తడు.

అవును మరి చింతజచ్చినాపుల్పు సావలేదు గద !

ఈసంసారం సంగతులు యావిదెల్వక మర్ది తనపరీక్షలకు ఫీసు లేదంటె గుడ్ల నీళ్లు గుక్కుకుంట దైర్నం జేసి 'నాపాలు పాలం గిర్వివెడ్తనంటడు' బింకంగ ఇంగా యాణ్ణొ బూమి గీమివున్నట్ల. రొండు దెల్వనితనం.

ఇట్ల నేను జెప్పుక పోతుంటె మాఅత్తమ్మకు యాష్టకొచ్చిందో ఏమొ ? నన్నుజూసి 'అమ్మ ! ఏందేకళ ? ఇందాకటినుండి యింటుండ, నీవుసీతమ్మ సెరోలె కత జేప్పుక పోతనేవుండవు' కొండను దోగి ఎల్కను వట్టినట్ల ఇందుట్ల కొత్తది ఆవగింజంత గూడ లేదు. దినాం మేంయింటున్న హరికతనె, సూస్తున్న ఏశమే !

సూడమ్మ ! బండాలంవుండంగనె సరిపోదు, దాన్ని కాపాయంజేసె తెల్విడి గుడ వుండాలె, కూసోని తింటె గుట్టలాగవు, కర్గిపోతనేవుంటవి. బత్కిసెడ్డయిండ్ల గతే యింత. అహంకారం, అజ్ఞానం, తిక్కతిరుగుళ్లు, చెడుసోపతి, తాగుడు, ఇస్పేటు ఇన్ని గల్శినంక చెప్పేదేముంటది ? ఆడ్గేదేముంటది. ఇనుప గజ్జెల తల్లి యిడ్సులు గాస్తది. తెల్సిందే నాయె ! యిగసాలు అన్నది.

ఆ మాటిన్న మా కళ 'అదికాదత్తమ్మ !నేను యింగ సెప్పవోతున్నది చంద్రకళ వడ్తున్న ఆపతి తిప్పలు. ఆపిల్ల సంకుటాలముచ్చెట్లు, యినుండి..

ఈబాబయ్య ఇంటి ఆడంబురం, మీది మెర్గులు, థాటుతడాకజూసి అసలు లో గుట్టు దెల్వక చంద్రను యికొంపలకు మనుమిచ్చిన్రు. నాపెండ్లైన కొన్నాళ్లకె బాబయ్య పెద్దకొడ్కు కృష్ణయ్య తోటి చంద్రకు పెండ్లైంది. వోమందిఅంత 'చంద్ర అంశ వంతు రాలంటె అంశమంతురాలని' అప్పుడు గాదిప్పుడంట పెండ్లిజేసిన్రు.

వోనాడు చంద్ర అత్తమాయింటికొచ్చి 'కళమ్మ ! నాకోడల్ని దోలుకొచ్చిన సూడు తల్లి అంట సూపింది. ఎంటొచ్చిన చంద్రను జూసెట్యాళ్లకు ఎవరోగాదు ఆపిల్ల నాదోస్తు చంద్రనే ! ఆనాడు యిద్దరం ఎన్కటి ముచ్చెట్లన్ని జెప్పుకోని ఆటిడ్పుగ గూసున్నం - సీకటి వడంగ కృష్ణవొచ్చి పెండ్లాన్ని దోల్కపాయిండు.